క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజును గురువారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సంగం నుంచి బాపట్లకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. సంగం తహసీల్దార్‌గా ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

'పల్లెకు పోదాం' జయప్రదానికి పిలుపు



చేజర్ల: బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. స్థానిక సాయి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంకు బాలయ్య, ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలలో నిమ్మకంటి కొండ స్వామి, నిమ్మకంటి కృష్ణయ్యకు చెందిన పొగాకు బ్యారన్ గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వింజమూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేలోగానే బ్యారన్‌లోని 1200 కర్రలు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.4.5 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలో నూతనంగా ఎంపికైన కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా విధులు నిర్వహించాలని సీడీపీఓ లావణ్య సూచించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో నూతనంగా ఎంపికైన ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, ముగ్గురు ఆయాలకు నియామకపత్రాలు అందజేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

4న చేనేత కులాల విజయభేరి



సంగం: నెల్లూరులోని డీజీపీ కల్యాణ మండపంలో ఈ నెల 4న చేనేత కులాల విజయభేరి నిర్వహించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ తెలిపారు. స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద చేనేత కార్మికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. చేనేత కులాల విజయభేరి సభకు చేనేత కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. చేనేత ఐక్యవేదిక కమిటీ నాయకులు గోపాల్, సురేష్, మల్లికార్జున, సుబ్బారావు, రవి పాల్గొన్నారు.

అక్రమంగా చేపల వేటపై ఫిర్యాదు

సోమశిల: సోమశిల జలాశయంలో కొందరు అక్రమంగా అలివి వలలతో వేట సాగించడంపై స్థానిక మత్స్యకారులు సోమశిల ఎస్సై భోజ్యానాయక్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొందరు అలివి వలలతో అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారన్నారు. మత్స్యసంపదను పూర్తిస్థాయిలో కొల్లగొడుతూ తమకు జీవనాధారం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు స్పందించి అక్రమంగా చేపల వేటసాగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ ఫలాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. విజయీభవ యాత్రలో భాగంగా మండలంలోని కనుపూరుపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. తొలుత ఎమ్మెల్యేకు సర్పంచ్ ఆర్ ఆదిలక్ష్మమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరయ్యయాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని ఎమ్మెల్యే సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఆయా కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కనుపూరుపల్లిలో రూ.5.25 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.12 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2 లక్షలు కూడా కేటాయించామని వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్లూరు ఆదిశేషయ్య, గడ్డం శ్రీనివాసులరెడ్డి, గుండుబోయిన వెంకటరత్నం, చిల్లూరు వెంకటేశ్వర్లు, బాలఅంకయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు వాశిపల్లి లక్ష్మిరెడ్డి, గుండుబోయిన మస్తానయ్య, వై పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు: మున్సిపల్ నూతన కమిషనర్‌గా షేక్ ఫజులుల్లా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆత్మకూరుకు వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న బల్లి నాగేశ్వరరావు గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి, పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, తదితరులు ఉన్నారు. కాగా నూతన కమిషనర్‌ను ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు పెంచలయ్య, రాజశేఖర్, మహబూబ్‌బాషా కలిసి అభినందనలు తెలిపారు.

కులగణన సర్వే తనిఖీ

చేజర్ల: ఆదూరుపల్లిలో చేపట్టిన కులగణన సర్వేను డీఎల్‌డీఓ టీవీ రమణయ్య గురువారం తనిఖీ చేశారు. ఆదూరుపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లను అడిగి కులగణన చేపట్టిన తీరును తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి అచ్చి ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి ప్రజావేదిక

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసి గుర్తించిన అవకతవకలపై చర్చించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తూమాటి

చేజర్ల: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించారని తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయలలిత, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తేళ్ల శేఖర్‌రెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏఎస్ఎం లక్ష్మీనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

జల సంఘ కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఈ రవీంద్రనాథ్

ఉదయగిరి: జలజీవన్ మిషన్ కింద మండలంలోని గ్రామాల్లో జలసంఘ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు మహిళలు, సచివాలయ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులతో పాటు తొమ్మిది మంది పొదుపు సభ్యులతో జల సంఘ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



చేజర్ల: టీకేపాడులో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ బాలయ్య



ఆత్మకూరు: 17వ వార్డులో వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ సమీ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజైన గురువారం 84.61 శాతం మందికి పింఛన్లు అందజేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. వలంటీర్లు వేకువజామునే అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

చేజర్ల: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. వలంటీర్లు వేకువజాము నుంచే అవ్వాతాతలకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరామర్శించి పింఛన్ అందజేశారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



అల్లూరు: మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా పలనాడు జిల్లాకు బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. తహసీల్దార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. తహసీల్దార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలపై పరిశీలన



అర్జీదారులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా

మర్రిపాడు: మండలంలోని నందవరం, పొంగూరు గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా గురువారం పర్యటించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు భూమస్యలపై అందిన అర్జీలపై విచారణ చేపట్టారు. నందవరానికి చెందిన మునీర్ సర్వే నంబర్ 415లో తనకున్న 5.90 ఎకరాల్లో 2 ఎకరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, మిగిలిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే పొంగూరుకు చెందిన నల్లబోతుల లక్ష్మమ్మ సర్వేనంబర్ 1071లో 30 ఏళ్లుగా తమపేరుపై ఉన్న భూమిలోకి వెళ్తుంటే గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆనందరావు, ఆర్ఐ సురేంద్రబాబుతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించిన ట్రెయినీకలెక్టర్ భూ సమస్యలపై విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. వారి వెంట వీఆర్వోలు నవీన్, హజరత్తయ్య ఉన్నారు.

సంగం: స్థానిక గురుకుల పాఠశాల ఎదురుగా సర్వే నంబర్ 273లో ఉన్న ఓ ప్రైవేట్ లేఅవుట్‌ను ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా గురువారం పరిశీలించారు. ఇటీవల పిట్టు రేణుకారెడ్డి అనే వ్యక్తి స్పందనలో లేఅవుట్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె లే అవుట్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పూర్తి నివేదికను పై అధికారులకు తెలియజేస్తామన్నారు. అనంతరం రేషన్ పంపిణీని తనిఖీ చేశారు. సరుకుల పంపిణీ తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ శాంతకుమారి ఉన్నారు.

భువనేశ్వరి పరామర్శ



కొండాపురం: మండలంలోని గానుగపెంటకు చెందిన తాటిపర్తి సుధాకర్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి గురువారం పరామర్శించారు. ఇటీవల చంద్రబాబు అరెస్ట్ సమయంలో అనారోగ్యంతో తాటిపర్తి సుధాకర్ మృతి చెందారు. అయితే చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక సుధాకర్ గుండె పోటుతో మృతి చెందాడని మండల టీడీపీ నాయకులు పరామర్శ కోసం భువనేశ్వరిని పిలిపించారు. ఆమె గానుగపెంటకు వెళ్లి పరామర్శించాల్సి ఉన్నా అక్కడకు వెళితే అనారోగ్యంతో సుధాకర్ మృతి చెందిన విషయం బయటపడుతుందని టీడీపీ మండల నాయకులు రాత్రికి రాత్రే షెడ్యూల్‌ను కొమ్మికి మార్చారు. సుధాకర్ భార్య వెంగమ్మను కొమ్మికి పిలిపించి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఆమె వెంట టీడీపీ నేతలు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ గీతారెడ్డి

కలిగిరి: క్షయ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందజేసే మందులతో పాటు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని వైద్యాధికారి బీ గీతారెడ్డి సూచించారు. కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ ఎస్టీఎస్ఎస్ శివ, సీటీసీ షబ్బీర్, సీహెచ్ఓ సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

అల్లూరు: జగనన్న లేఅవుట్‌లలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అన్నారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అల్లూరు–3,4 సచివాలయ పరిధిలోని జగనన్న లేఅవుట్ ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి, వీఆర్వోలు సలాం, కరిముల్లా, తదితరులు ఉన్నారు.

కలప వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండాపురం: గానుగపెంట పంచాయతీ పరిధిలోని సోషల్‌ఫారెస్ట్‌లోని జామాయిల్ కర్రను సర్పంచ్ మంచాల మల్లికార్జున ఆధ్వర్యంలో కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ గురువారం వేలం వేశారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన వేలంలో 16 మంది పాల్గొన్నారు. సోషల్ ఫారెస్ట్‌లోని 5,765 జామాయిల్ చెట్లకు అటవీశాఖ అధికారులు ప్రభుత్వ రేటు ప్రకారం రూ. 9,71,332 ధర నిర్ణయించారు. కొండాపురానికి చెందిన దావులూరి మాలకొండయ్య రూ.16.90 లక్షలకు జామాయిల్ కర్రను వేలంలో దక్కించుకున్నాడు. వేలం పాడిన మొత్తం నగదులో 25 శాతం తక్షణమే చెల్లించాలని, మిగిలిన 75 శాతం మొత్తాన్ని 15 రోజుల్లోగా చెల్లించిన తర్వాతే కర్రను కొట్టుకొనుటకు అనుమతి లభిస్తుందని డీఎల్‌పీఓ తెలిపారు. అలాగే గానుగపెంట పంచాయతీ పరిధిలోని ఆదిమూర్తిపురం చెరువులోని 1558 తుమ్మ చెట్లకు వేలం నిర్వహించారు. ప్రభుత్వం రూ. 1,90,787 ధర నిర్ణయించగా గానుగపెంటకు చెందిన దాసరి వెంకటేశ్వర్లు రూ. 4.30 లక్షలకు దక్కించుకున్నాడు. ఈఓపీఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, పృథ్వీ, కందుకూరు డీఆర్వో సుజాత, వైస్ఎంపీపీ బంకా మాల్యాద్రి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామకపత్రాల అందజేత



అంగన్‌వాడీలకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఐసీడీఎస్ కావలి ప్రాజెక్ట్ పరిధిలో నూతనంగా ఎంపికైన ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, నలుగురు ఆయాలకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన నివాసంలో గురువారం నియామకపత్రాలను అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ సచివాలయంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం కింద రీ సర్వే చేపడుతోందని తెలిపారు. రీ సర్వే ఆధారంగా భూసమస్యలను పరిష్కరించి రికార్డులను నవీకరిస్తుందన్నారు. రీసర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం తిరుపతయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతను పాటించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కావలి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలను నడపరాదని, ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



ఉదయగిరి: జబ్బార్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



ఏఎస్‌పేట: వెంకటరమణయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: మండలంలోని జమ్మవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పూరి వెంకటరమణయ్య తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునగచర్ల వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు రామ్మోహన్, రాజ, ప్రసాద్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

ఉదయగిరి: పట్టణంలోని దిలావర్‌బావి వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ జబ్బార్‌ను ఆ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల జబ్బార్ అనారోగ్యంతో నెల్లూరులోని వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేకపాటి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, నాయకులు మాట్ల లక్ష్మయ్య ఉన్నారు.